ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక




## 2047 నాటికి వికసిత్ భారత్

దేవుడు తనను వెనక్కి పిలవడు
లక్ష్యాన్ని సాధిస్తాననే పూర్తి విశ్వాసం ఉంది
24 గంటలు పని చేసేలా దేవుడు నన్ను నియమించాడు
జాతీయ ఛానెల్ ఇంటర్వ్యూలో ప్రధాని నరేంద్రమోదీ

2లో..


సంపుటి: 2 | సంచిక: 45 | పేజీలు: 4 | వెల: రూ.3/- | శనివారం 25 మే 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్




మేడిగడ్డను సందర్శించనున్న

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, (ప్రభాత ఉదయం): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మేడిగడ్డను సందర్శించనున్నారు. వచ్చేవారం ఆయన పర్యటన ఉండనుంది. ఏ రోజున సీఎం విజిట్ చేస్తారనేది రెండు రోజుల్లో తెలియనుంది. ఈ టూర్‌లో భాగంగా ఏ మేరకు డ్యామేజ్ అయ్యింది, పనులకు ఎంతకాలం పడుతుందని అనేదానిపై ఓ అంచనాకు రానున్నారు. తాజాగా కాళేశ్వరం ..మిగతా 2లో

# నేడు ఆరో దశ ఎన్నికలకు సర్వం సిద్ధం

## 6 రాష్ట్రాలు, 2 కేంద్రపాలిత ప్రాంతాల్లో పోలింగ్

### 58 నియోజకవర్గాలకు జరగనున్న ఎన్నికలు



న్యూఢిల్లీ, మే 24 (ప్రభాత ఉదయం): దేశవ్యాప్తంగా మొత్తం 7 దశల్లో జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో ఇప్పటికే 5 దశల పోలింగ్ జరిగింది. శనివారం 25 మే ఆరో దశ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ జరగనుంది. ఈ దశలో లోక్‌సభ ఎన్నికలు దేశ రాజధాని ఢిల్లీతో సహా మరో 6 రాష్ట్రాలు, 2 కేంద్రపాలిత ప్రాంతాల్లో మొత్తంగా 58 నియోజకవర్గాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో ఉత్తరప్రదేశ్ 14, పశ్చిమ బెంగాల్ 8, ఢిల్లీ 7, ఒడిశా 6, బీహార్ 8 సీట్లు, హర్యానా 10 సీట్లు, జమ్మూ కశ్మీర్ 1, జార్ఖండ్ 4 సీట్లకుగానూ ఏకంగా 889 మంది అభ్యర్థుల బరిలో ఉన్నారు.గత నెలలో ఎన్నికల సంఘం జమ్ముకశ్మీర్‌లోని అనంతనాగ్-రాజౌరీ లోక్‌సభ స్థానానికి పోలింగ్ తేదీని లాజిస్టికల్, కమ్యూనికేషన్ అండ్ కనెక్టివిటీకి సంబంధించి అడ్డంకుల కారణంగా మే 7 నుండి మే 25 కు మార్చింది. ఇక రేపు జరగనున్న ఎన్నికలకు ఇప్పటికే ఎలక్షన్ కమిషన్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. శనివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఇక దేశవ్యాప్తంగా పోలింగ్ జరగనున్న నియోజకవర్గాలు చూస్తే.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని సుల్తాన్‌పూర్, ప్రతాప్ గఢ్, ఫుల్పూర్, అలహాబాద్, అంబేద్కర్ నగర్, శ్రావస్తి, డోమ్రియాగంజ్, బస్తీ, ..మిగతా 2లో




# తెలంగాణ అవతరణ వేడుకలకు ఈసీ అనుమతి

### ఘనంగా దశాబ్ది వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు
### అధికారులతో సమీక్షించి సూచనలు చేసిన సిఎస్

హైదరాబాద్, మే 24 (ప్రభాత ఉదయం): తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం అనుమతిచ్చింది. జూన్ 2న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో రాష్ట్ర అవతరణ వేడుకలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అదే రోజు గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి నివాళులు అర్పించనున్నారు. ఈసీ నుంచి అనుమతి లభించిన నేపథ్యంలో వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లు చేయలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి వివిధశాఖల అధికారులను ఆదేశించారు. దశాబ్ది వేడుకలు కావడంతో ధూమ్‌ధామ్‌గా చేపట్టాలని నిర్ణయించారు. ఇందులో తెలంగాణ ఉద్యమకారులను సిఎం రేవంత్ సన్మినించే అవకాశం ఉంది. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి శుక్రవారం ఉన్నతాధికారులతో సమీక్షించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించేందుకు ఈసీ ప్రభుత్వానికి అనుమతి ఇవ్వడంతో, అందుకు తగిన విధంగా విస్తృత ఏర్పాట్లు చేయాలని శాంతి కుమారి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ ..మిగతా 2లో

## ప్రజాస్వామం, రాజ్యాంగాన్ని కాపాడేందుకే ఎన్నికలు

### ఆలోచించి ఓటు వేయాలని ఢిల్లీ ప్రజలకు సోనియా పిలుపు



న్యూఢిల్లీ, మే 24 (ప్రభాత ఉదయం): సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా 58 సీట్లకు ఆరో విడత పోలింగ్ శనివారం జరగనుంది. ఆరు రాష్ట్రాలతోపాటు రెండు కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఉన్నాయి. ముఖ్యంగా ఢిల్లీ ఓటర్లు ఈసారి ఎటువైపు మొగ్గు చూపుతారోన న్నది ఆసక్తి రాజకీయ పార్టీల్లో నెలకొంది. ఢిల్లీలో మొత్తం ఏడు సీట్లు ఉన్నాయి. అన్నింటిలోనూ బీజేపీ పోటీ చేస్తుండగా, కూటమి తరపున ఆప్ నాలుగు, కాంగ్రెస్ మూడు చోట్ల బరిలోకి దిగాయి. గత ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిచిన అభ్యర్థులను ఈసారి బీజేపీ మార్చేసింది. కాకపోతే ఢిల్లీ ఓటర్ల తీర్పు విభిన్నంగా ఉంటుంది. 2019లో బీజేపీకి విజయాన్ని కూడబెట్టిన హస్తిన ఓటర్లు, మరుసటి ఏడాది ఢిల్లీ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో ఆప్ వైపు మొగ్గు చూపారు. ఈసారి అక్కడ ఎన్నికల ఉత్కంఠబరితంగా సాగుతున్నాయి. సీఎం ..మిగతా 2లో

## జైలు నుంచి పోటీ చేసినా 70 సీట్లు గెలుస్తాం

### బీజేపీకి ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ సవాల్



న్యూఢిల్లీ, మే 24 (ప్రభాత ఉదయం): ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ బీజేపీకి సవాల్ విసిరారు. తమ పార్టీ ఎమ్మెల్యేలందరినీ జైల్లో నిర్బంధించి ఎన్నికలు జరపాలని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల వరకూ తాను జైల్లో ఉన్నా ఆమ్ ఆద్మీ పార్టీ ఢిల్లీలోని మొత్తం సీట్లను గెలుచుకుంటుందని తెలిపారు. ఓ వార్తా పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలపై మాట్లాడారు. ప్రజలు అమాయకులని బీజేపీ నేతలు భావిస్తున్నారని తెలిపారు. బీజేపీకి ఢిల్లీ ప్రజలే దీటుగా బదులిస్తారని పేర్కొన్నారు. అయితే ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసుకు సంబంధించి జైలు పాలైనా సీఎం పదవికి ఎందుకు ..మిగతా 2లో



## బస్సు తప్పా అన్ని పథకాలు తుస్సే

### కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్ని అన్ని అబద్దాలే
### కాంగ్రెస్ బండి ఇప్పుడు రివర్స్‌గేర్‌లో నడుస్తుంది
### కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీష్‌రావు విమర్శలు

హైదరాబాద్, మే 24 (ప్రభాత ఉదయం): నాలుగు నెలలోనే కాంగ్రెస్ మోసం బయట పడింది మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. ఖమ్మం జిల్లా బోనకల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన హరీష్ రావు మాట్లాడుతూ.. బస్సు తప్పా అన్ని పథకాలు తుస్సే అని విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్ని అన్ని అబద్దాలే అన్నారు. కాంగ్రెస్ బండి ఇప్పుడు రివర్స్ గేర్ లో నడుస్తుందన్నారు. బీఆర్ఎస్ హయాంలో కరెంటు 24 గంటలు ఇస్తే.. ఇప్పుడు 14గంటలు మాత్రమే వస్తుందని చెప్పారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ప్రజలు తిరగబడతారన్నారు. హైదరాబాద్ ను ఉమ్మడి రాజధానిగా మరో పదేళ్లు పొడిగించాలని కాంగ్రెస్, బీజేపీ కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. జర్నలిస్ట్ ల సంక్షేమం కోసం రూ.100కోట్లు ఇస్తామన్న కాంగ్రెస్ రూ.100 రూపాయలు కూడా ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. ప్రజలు ..మిగతా 2లో

## రాష్ట్రంలో రూ. 4 వేల కోట్లు వసూలు

### ఆర్ఆర్ టాక్స్ పేరుతో తెలంగాణలో వసూలు
### ఆ డబ్బును రాహుల్ గాంధీకి పంపిస్తున్నారు
### ఆగస్టు 15 లోపు రుణమాఫీ చేయడం అసాధ్యం
### ఈటల రాజేందర్ సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్, మే 24 (ప్రభాత ఉదయం): గత ఆరు నెలలుగా తెలంగాణలో రూ. 4 వేల కోట్లు అక్రమంగా వసూలు చేసి, రాహుల్ గాంధీకి పంపిస్తున్నారని బీజేపీ నేత ఈటల రాజేందర్ ఆరోపించారు. పరకాలలో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. "సాక్షాత్తూ దేశ ప్రధానమంత్రే ఈ గడ్డ మీదకు వచ్చి ఈ ప్రభుత్వం డబుల్ ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తోందని చెప్పాడంటే ఆలోచించండి. ప్రతీ ఒక్కరూ బీజేపీ తరపున ప్రేమేందర్ రెడ్డికే ఓట్లు వేస్తామంటున్నారు. గత ప్రభుత్వం కానీ, ప్రస్తుత ప్రభుత్వం కానీ ఏళ్లుగా టీచర్లకు జీతాలు చెల్లించడం లేదు. గతంలో కేసీఆర్ అన్యాయం చేసినందుకు ఇంటికి పంపించారు. బీఆర్ఎస్ పార్టీ పదేళ్లుగా డీఏలు చెల్లించలేదు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ కూడా తమ హామీలు నిలబెట్టుకోలేదు. ఈటల రాజేందర్ అన్నారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా హామీలు ..మిగతా 2లో



## హర్యానాలో ఘోర రోడ్డు ప్రమాదం

### ట్రక్కును ఢీకొన్న మినీ బస్సు
### ఏడుగురు మృతి, 25 మందికి పైగా గాయాలు

అంబాలా, మే 24 (ప్రభాత ఉదయం): హర్యానాలోని అంబాలాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మినీ బస్సు ట్రక్కును ఢీకొట్టడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో 7 మంది మృతి చెందగా, 25 మంది గాయపడినట్లు సమాచారం. క్షతగాత్రులను అంబాలా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం.. అంబాలా-ఢిల్లీ-జమ్మూ జాతీయ రహదారిపై వైష్ణో దేవికి యాత్రికులతో వెళ్తున్న మినీ బస్సు ట్రక్కును ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటన శుక్రవారం తెల్లవారుజామున హర్యానాలోని అంబాలాలో జరిగింది. ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్ నుంచి వైష్ణో దేవి దర్శనం కోసం వీరందరూ మినీబస్సులో వెళ్తున్నారు.ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు మృతి చెందగా, 25 మందికి పైగా గాయపడ్డారు. వీరిలో నలుగురు పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారిని కొంతమందిని సివిల్ ఆస్పత్రికి తరలించారు. ఆ ప్రమాదంలో తృటిలో తప్పించుకున్న కొందరు వ్యక్తులు తాము ప్రయాణిస్తున్న బస్సు కంటే ముందు ట్రక్కు ఒక్కసారిగా బ్రేకులు వేయడంతో మినీ బస్సు ట్రక్కును ఢీకొట్టిందని పోలీసులకు వివరించారు.

# మోసపోతే గోస పడతాం



## ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాకేశ్‌ను గెలిపించండి
## నకిరేకల్ ప్రచారంలో బిఆర్ఎస్ నేత కెటిఆర్

నల్లగొండ, మే 24 (ప్రభాత ఉదయం): మోసపోతే గోస పడుతాం అని చెప్పినం. నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లోవిచక్షణతో ఓటెయ్యాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం నకిరేకల్‌లో గ్రాడ్యుయేట్ ఓటర్ల సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి రుణమాఫీ అని చెప్పి పచ్చి మోసం చేశాడు. ధాన్యం బోనస్ విషయంలో కూడా మాట తప్పిండని విమర్శించారు. సన్న వడ్లకు మాత్రమే బోనస్ అంటూ అన్ని బోగస్ మాటలు మాట్లాడుతున్నాడని సీఎంపై మండిపడ్డారు. ఆరు గ్యారంటీలతో అభూతకల్పనలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ఇన్ని అబద్ధాలు ఆడుతున్న కాంగ్రెస్‌కు ఓటుతో సరైన బుద్ధి చెప్పాలన్నారు. అలాగే విద్యుత్ కూడా సరిగా ఇవ్వడం లేదని ఆరోపించారు. ఓట్లప్పుడు మాత్రమే రైతుబంధు ఇస్తుండు, మహిళలకు రూ.2,500 ఇస్తా అని మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు కూడా నిర్లజ్జగా అబద్ధాలు ఆడుతున్నారని ఘాటుగా విమర్శించారు. దేవుళ్ల మీద ఒట్లు వేస్తూ రేవంత్ రెడ్డి పూటకో అబద్ధం ఆడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. నోటిఫికేషన్లు ఇవ్వకుండా ఉద్యోగాలు ఇచ్చినం అని అబద్ధాలు ఆడుతున్నాడు. 30 వేల ఉద్యోగాలు కేసీఆర్ రిక్రూట్మెంట్ చేస్తే వాటికి కాగితాలు పంచుతూ సీఎం అబద్ధాలు ఆడుతున్నాడని విమర్శించారు. బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్ రెడ్డి గొప్ప విద్యావంతుడు అతనికి ఓటేస్తే ప్రభుత్వంపై కొట్లాడుతాడని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇక కాంగ్రెస్ అభ్యర్థి పచ్చి బ్లాక్ మెయిలర్. అతను అబద్ధాలు ఆడే వ్యక్తి. 56 క్రిమినల్ కేసులు ఉన్నాయని గుర్తు చేశారు. అమ్మాయిలు పెట్టిన కేసులే పది దాకా ఉన్నాయి. అతను చేసేవి అన్నీ లంగ పనులేనని ఘాటు విమర్శించారు. అతన్ని చట్టసభల్లోకి రానివ్వకుండా బుద్ధి చెప్పాలన్నారు. జీవో 46 ని రద్దు చేసేందుకు మా ప్రభుత్వంలో అన్నీ సిద్ధం చేసినం. దురదృష్టవశాత్తు అప్పటికే ఎన్నికల కోడ్ వచ్చింది. ప్రాసెస్ అంతా నిలిచిపోయింది. ఇప్పుడు ఆ జీవోను రద్దు చేసేంత వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.



## బస్సు తప్పా అన్ని పథకాలు తుస్సే

మొదటి పేజీ తరువాయి...

కాంగ్రెస్ పార్టీ కి గుణపాఠం చెప్పనున్నారని తెలిపారు. అబద్ధాలు, మోసాలు, ఉన్న పథకాలు ఊదరగొట్టటం తప్పా.. కాంగ్రెస్ ప్రజలకు చేసింది ఏమిలేదని విమర్శించారు.తమ్మినేని వీరభద్రం తీన్మార్ మల్లన్నకు మద్దతు తెలపడం ముదిగొండ అమరవీరుల ఆత్మ క్షోభిస్తుందని బీఆర్ఎస్ నాయకుడు ఆర్ ఎస్ ప్రవీణ్ అన్నారు. ప్రశ్నించే గొంతుక అని చెప్పుకునే తీన్మార్ మల్లన్న.. ఏ రోజైన పేద విద్యార్థుల కోసం మాట్లాడలేదన్నారు. 56 కేసులున్న తీన్మార్ మల్లన్న పట్టభద్రులగా ఎన్నుకుంటారా? అని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్ రెడ్డి మాట్లాడుతూ..నిరుద్యోగ భృతి, ఉద్యోగ నోటిఫికేషన్, జాబ్ క్యాలెండరు లేదు.. తనను గెలిపిస్తే నిరుద్యోగుల, ఉద్యోగుల పట్ల ప్రశ్నించే గోతుకకై పోరాడుతా అని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జీవో నెంబర్ 46 ఎందుకు రద్దు చేయడం లేదని.. తాను ఎమ్మెల్సీ గా గెలిస్తే నా జీతంతో పేద విద్యార్థుల కోసం సంక్షేమ నిధి ఏర్పాటు చేస్తా అని హామీ ఇచ్చారు.

## నేడు ఆరో దశ ఎన్నికలకు సర్వం సిద్ధం

మొదటి పేజీ తరువాయి...

సంత్ కబీర్ నగర్, లాల్‌గంజ్, అజంగఢ్, జౌన్‌పూర్, మఛ్లిషహర్, భదోహి పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని తమ్లుక్, కంఠి, ఘటల్, ఝర్‌గ్రామ్, మేదినీపూర్, పురూలియా, బంకురా, బిష్ణుపూర్ హర్యానా రాష్ట్రంలోని అంబాలా, కురుక్షేత్ర, సిర్సా, హిసార్, కర్నాల్, సోనిపట్, రోహ్తక్, భివానీ-మహేంద్రగఢ్, గుర్గావ్, ఫరీదాబాద్ జార్ఖండ్ రాష్ట్రంలోని గిరిడి, ధన్‌బాద్, రాంచీ, జంషెడ్‌పూర్ బీహార్ రాష్ట్రంలోని వాల్మీకి నగర్, పశ్చిమ్ చంపారన్, పూర్వి చంపారన్, షెయోహర్, వైశాలి, గోపాల్‌గంజ్ , శివన్, మహారాజ్‌గంజ్ ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్, పూరి, ఢెంకనల్, కియోంజర్ , కటక్, సంబల్పూర్ జమ్మూ కశ్మీర్ (కేంద్రపాలిత ప్రాంతం) లో అనంతనాగ్-రాజౌరి ఢిల్లీ (కేంద్రపాలిత ప్రాంతం) లో చాందినీ చౌక్, ఈశాన్య ఢిల్లీ, తూర్పు ఢిల్లీ, న్యూఢిల్లీ, వాయువ్య ఢిల్లీ, పశ్చిమ ఢిల్లీ, దక్షిణ ఢిల్లీలలో జరగనున్నాయి.

## తెలంగాణ అవతరణ వేడుకలకు ఈసీ అనుమతి

మొదటి పేజీ తరువాయి...

వేడుకలను సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించ నున్నట్లు తెలిపారు. సీఎం ముందుగా గన్ పార్క్‌ను సందర్శించి తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు నివాళులర్పిస్తారని అన్నారు. ఈ సందర్భంగా పరేడ్ గ్రౌండ్ వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్ల పై అధికారులకు సీఎస్ దిశానిర్దేశం చేశారు. ప్రముఖులు ప్రయాణించే మార్గాలలో అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, పార్కింగ్ స్థలాలను కేటాయించేటప్పుడు ట్రాఫిక్ రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసి ట్రాఫిక్ కు అంతరాయం కలుగకుండా జాగ్రత్తలు చేపట్టాలని పోలీసు శాఖను ఆదేశించారు. సభా ప్రాంగణం పరిసర పారంతాలలో పారిశుధ్య పనుల నిర్వహణ తోపాటు తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, రోడ్డుకు ఇరువైపులా రంగురంగుల జెండాలను అలంకరించాలని జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. పండుగ వాతావరణాన్ని తలపించేలా కళాకారులతో ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సాంస్కృతిక శాఖను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని అన్నారు.

## జైలు నుంచి పోటీ చేసినా 70 సీట్లు గెలుస్తాం

మొదటి పేజీ తరువాయి...

రాజీనామా చేయలేదని ప్రశ్నించగా తాను ఒక వేళ రాజీనామా చేస్తే తర్వాత మోదీ బెంగాళ్ లో మమతా బెనర్జీ, తమిళనాడులో ఎంకే స్టాలిన్, కేరళలో పినరాయి విజయన్ ఇలా విపక్ష సీఎంలను టార్గెట్ చేస్తారని సమాధానం ఇచ్చారు. అసెంబ్లీ ఎన్నికల వరకు తాను జైల్లో ఉన్నా తన భార్య ఎన్నికల్లో పోటీ చేయదని స్పష్టం చేశారు. విపక్ష నేతలను అరెస్టు చేసి ఆయా ప్రభుత్వాలను కూల్చాలని మోదీ సర్కార్ భావిస్తుందని అన్నారు. తనకు పదవీ కాంక్ష లేదని.. తాను రాజీనామా చేస్తే అది ప్రజాస్వామ్యానికి చేటు చేస్తుందని తెలిపారు. గతంలో మురికి వాడలో పనిచేసేందుకు ఆదయపన్ను శాఖ కమిషనర్ పదవికి రాజీనామా చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

## రాష్ట్రంలో రూ. 4 వేల కోట్లు వసూలు

మొదటి పేజీ తరువాయి...

నిలబెట్టుకోలేనందుకు బుద్ధి చెప్పాలి. నిజాలు తెలుసుకుని ఓటును సద్వినియోగం చేసుకోవల్సిందిగా కోరుతున్నాను." అని ఆయన వ్యాఖ్యానించారు. ఎత్తిన జెండా దించకుండా, నమ్మిన సిద్ధాంతం కోసం ప్రజల కోసం పార్టీ కోసం జీవించిన వ్యక్తి ప్రేమేందర్ రెడ్డి అని ఈటల రాజేందర్ అన్నారు. "నల్గొండలో ఒక వ్యక్తి నడమంత్రపు సిరితో బీజేపీ ఎక్కడుంది అని అడిగాడు. 4 వ తేదీన తెలుస్తుందని చెప్పి వచ్చా. చాపకింద నీరులా తెలంగాణలో బీజేపీ పార్టీ బలం పుంజుకుంటోంది. చీమలు పుట్టలు పెడితే పాములు దూరినట్లు, మనమందరం కొట్లాడితే తెలంగాణ వచ్చింది. దీనిలో రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాడు. ప్రశ్నించే గొంతు అంటూ మాట్లాడుతూ ఉంటారు ముఖ్యమంత్రి. కానీ ఇప్పుడు అధిష్టానం చేతిలో పిల్లిలా తయారయ్యారు. అధికార పార్టీలో ఉంటే ప్రశ్నించే అవకాశం ఉండదు. నేను పది రోజులుగా తెలంగాణ వ్యాప్తంగా ఎంతోమందితో భేటీలు, మీటింగులు నిర్వహించాను. అడ్వకేట్లతో, డాక్టర్లతో, నిరుద్యోగులతో, ఉపాధ్యాయులతో, ఉద్యోగులతో, అంగన్ వాడీలతో, ప్రైవేట్ ఉద్యోగులతో సమావేశాలు జరిగాయి. వారందరూ ఎన్నో బాధలు చెప్పుకున్నారు. శాసన సభలో కొట్లాడడానికి మనపార్టీ వాళ్లున్నారు. అలాగే శాసన మండలిలో కూడా ఏవీఎన్ రెడ్డి గారితో పాటు ప్రేమేందర్ రెడ్డి కూడా కొట్లాడడానికి రెడీగా ఉన్నారు. గత రెండు దశాబ్దాలుగా ప్రజాజీవితంలో ఉన్నాం. ప్రజల పక్షాన నిలబడి కొట్లాడడానికి బీజేపీ పార్టీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది." అని ఈటల పేర్కొన్నారు. ఆగస్టు 15 లోపల రుణమాఫీ చేయడం అసాధ్యమని మాజీ మంత్రి బీజేపీ నేత ఈటల రాజేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణ కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్ లో, పాలకుర్తి నియోజకవర్గం స్థాయి, వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల ఎన్నికల సందర్భంగా పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో ఈటట మాట్లాడుతూ.. ఆగస్టు 15 లోపల రుణమాఫీ చేయడం అసాధ్యమని అన్నారు. ఇంత తక్కువ కాలంలో ప్రజల చేత చీత్కరింపబడిన ప్రభుత్వం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వానిది అన్నారు. తెలంగాణలో నిరుద్యోగులను మోసం చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని,ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు 4000 రూపాయల నిరుద్యోగ భృతి ఇస్తానని ఇప్పటికీ అమలు చేయలేదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేశాయన్నారు. ఆరోగ్యశ్రీ బకాయిలను చెల్లించలేని పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం, ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం చేయించుకోవాలని నిరుపేదలు ఆస్తుల అమ్మి వైద్యం చేయించుకుంటున్నారని తెలిపారు. నిరుపేదలకు వైద్యం ఖర్చులు పెట్టలేని కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్టర్లకు వేలకోట్ల రూపాయలు ఇస్తున్నారని అన్నారు..

## 2047 నాటికి వికసిత్ భారత్

న్యూఢిల్లీ, మే 24 (ప్రభాత ఉదయం): సార్వత్రిక ఎన్నికల వేళ బీజేపీలో కొత్త చర్చ మొదలైంది. మోదీ తర్వాత నెక్ట్స్ ప్రధాని ఎవరు? ఒకవేళ బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తేనే.. పార్టీ నిబంధనల ప్రకారం మరో ఏడాది మాత్రమే మోదీ ఆ పదవిలో కొనసాగుతారు. ఆ తర్వాత ఎవరు? అమిత్ షా లేక మరెవరైనా ఉన్నారా? ఇదే చర్చ జాతీయస్థాయిలో కొనసాగుతోంది. బీజేపీలో ప్రస్తుత నేతకు వయసు అయిపోయిందని , ఏడాది తర్వాత రిటైర్మెంట్ కావచ్చని ప్రత్యర్థి పార్టీలు కామెంట్స్ చేస్తున్నాయి. ఈ ప్రచారానికి తనదైన శైలిలో ఫుల్‌స్టాప్ పెట్టే ప్రయత్నం చేశారు ప్రధాని నరేంద్రమోదీ. ప్రత్యేక కార్య సాధన కోసం భవవంతుడు తనను పంపించాడని చెప్పుకొచ్చారు. లక్ష్యసాధన కోసం 2047 వరకు 24 గంటలు పని చేసేలా దేవుడు తనను నియమించాడని భావిస్తున్నట్లు మనసులోని మాట బయటపెట్టారు. ఈ యవ్వారంపై సొంత పార్టీలో జరుగుతున్న చర్చ, అటు విపక్షాలకు కౌంటరిచ్చేశారు మోదీ. ఇటీవల ఓ జాతీయ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. దేవుడు తనకు మార్గం చూపించాడని, శక్తి ఇస్తున్నాడని తెలిపారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధిస్తాననే పూర్తి విశ్వాసం ఉందన్నారు. అప్పటివరకు దేవుడు తనను వెనక్కి పిలవడని అనుకున్నట్లు వెల్లడించారు. ప్రపంచంలో ఇక్కడ తప్ప మరెక్కడా తనకు చోటు లేదని వ్యాఖ్యానించారు ప్రధాని మోదీ. మోదీ నేతృత్వంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త పద్దతిని తీసుకొచ్చారు. 75 ఏళ్లు నిండిన వారు రాజకీయాల నుంచి రిటైర్మెంట్ ఇవ్వాలనే నిబంధన తీసుకొచ్చారు. ఈ క్రమంలో ఎల్‌కే అద్వానీ, మురళీ మనోహర్‌జోషి, కర్ణాటక మాజీ సీఎం యడ్యూరప్పతోపాటు మరికొందరు నేతలు రాజకీయాలకు దూరమయ్యారు. ఈ లెక్కన మరో ఏడాదితో మోదీ రిటైర్మెంట్ సమయం వచ్చేసింది. ఈ విషయాన్ని సొంత పార్టీలోని నేతలు చర్చించుకోవడం మొదలైంది. మోదీ తర్వాత అమిత్ షాతోపాటు పలువురు నేతలు ఆయన కుర్చీ కోసం పోటీ పడుతున్నట్లు ఢిల్లీ సర్కిల్స్‌లో వార్తలు జోరందుకున్నాయి. ఈ క్రమంలో ఆయా వార్తలకు ప్రధాని మోదీ ఈ విధంగా ఫుల్‌స్టాప్ పెట్టారు.యూపీలోని ఎన్నికల సభలో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కూడా ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. బీజేపీ లో పెద్దవాళ్లకు రిటైర్‌మెంట్ వయసు దగ్గరకు వచ్చిందని మహా అంటే ఏడాది మాత్రమే ఉంటారన్నారు. దీని తర్వాత ఒడిషా సీఎం నవీన్ పట్నాయక్ వయసును ఉద్దేశించి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయనకు 77 ఏళ్లు వచ్చాయని, అనేక సమస్యలు వెంటాడుతాయని, రాజకీయాల నుంచి తప్పుకుంటే బాగుంటుందని ఒడిషా ప్రచారంలో చెప్పుకొచ్చారు. దానికి కాంగ్రెస్ పార్టీ నుంచి కౌంటర్లు పడిపోయాయి. మోదీ తర్వాత ఆ కుర్చీ కోసం అమిత్‌షా పోటీ పడుతున్నారని చిదంబరం తనదైన శైలిలో సెటైర్లు వేశారు. ఎన్నికల వేళ జరుగుతున్న ఈ తరహా ప్రచారానికి ప్రధాని మోదీ తనదైనశైలిలో ఫుల్‌స్టాప్ పెట్టారని అంటున్నారు. మరి బీజేపీలో మిగతా నేతల మాటేంటన్నది కొత్త సమస్య. కాగా.. ప్రధాని మోదీ శుక్రవారం హిమాచల్‌ప్రదేశ్ మండీ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా చివరి విడతలో జూన్ 1న మండీ నియోజకవర్గానికి పోలింగ్ జరగనుంది. ఈ సందర్భంగా మండీలో ప్రధాని మోదీ భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మండి బీజేపీ అభ్యర్థి, బాలీవుడ్ నటి కంగనా రనౌత్%%% ప్రధానికి గులాబీ పువ్వుతో స్వాగతం పలికారు. ఈ మేరకు ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో ఫొటోలు షేర్ చేశారు. ప్రధాని మోడీ స్టేజ్ మీదకు రాగానే కంగనా రనౌత్ నమస్కారం చేసి ఎర్ర గులాబీని అందజేశారు. సోషల్ మీడియాలో ఫొటోలు షేర్ చేస్తూ%%% మండీకి స్వాగతం అంటూ క్యాప్షన్ ఇచ్చారు. ఇక కంగనా రనౌత్ క్రీమ్ చీరతో హిమాచలీ టోపీని ధరించారు. ఇక ఈ కార్యక్రమానికి స్థానికులు భారీగా తరలివచ్చినట్లు కంగనా ఫొటోలు పంచుకున్నారు. ఈ పోస్ట్‌పై ఓ అభిమాని చాలా అద్భుతం అని వ్యాఖ్యానించారు. దేశ వ్యాప్తంగా ఏడు విడతల్లో పోలింగ్ జరుగుతోంది. ఇప్పటికే ఐదు దశల పోలింగ్ ముగిసింది. ఆరో విడత శనివారం జరగనుంది. చివరి విడత జూన్ 1న జరగనుంది. మండీ నియోజకవర్గానికి కూడా జూన్ 1న పోలింగ్ జరగనుంది. ఇక ఎన్నికల ఫలితాలు మాత్రం జూన్ 4న విడుదల కానున్నాయి.

## మేడిగడ్డను సందర్శించనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

మొదటి పేజీ తరువాయి...

లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులోని ప్రధాన బ్యారేజ్ మేడిగడ్డ మరమ్మతులను వేగం చేయాలని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. గురువారం సచివాలయంలో నిర్మాణ సంస్థ ప్రతినిధులు, నీటిపారుదల శాఖ అధికారులు, సీడబ్ల్యూసీ ఇంజనీర్లుతో ఆయన సమావేశం నిర్వహించారు. మేడిగడ్డ పునరుద్ధరణ పనులపై ఇటీవల జాతీయ ఆనకట్టల భద్రత పర్యవేక్షణ సంస్థ ప్రభుత్వానికి మధ్యంతర నివేదిక ఇచ్చింది. దీని ఆధారంగా పనులు కొనసాగించాలని ఆదేశించారు. వర్షాలు వచ్చేలోగా తాత్కాలిక పనులను పూర్తి చేయాలని సూచన చేశారు. ముఖ్యంగా మేడిగడ్డ పనులకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అదే సమయంలో అటు అన్నారం, సుందిళ్ల వద్ద పనులను చేపట్టాలన్నారు. పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు నివేదికలు ఇవ్వాలని అధికారులను కోరారు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి. ఈ క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి వచ్చేవారం మేడిగడ్డ బ్యారేజ్‌ని సందర్శిస్తారని చెప్పుకొచ్చారు. ఇదిలా వుండగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణకు సూచనలు, సలహాలు అందించేందుకు వివిధ రంగాలకు చెందిన నిపుణులతో కూడిన కమిటీని నీరుపారుదల శాఖ ఏర్పాటు చేసింది. కాళేశ్వరం న్యాయ విచారణ కమిషన్ ఆదేశాల ప్రకారం ఈ కమిటీని ఏర్పాటు చేస్తూ నీటిపారుదల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీ ఆయా ప్రాజెక్టులను సందర్శించి సమగ్ర అధ్యయనం చేశాక కమిషన్‌కు నివేదిక ఇవ్వనుంది. ఇదిలావుండగా మేడిగడ్డ బ్యారేజీ వద్ద మళ్లీ ప్రకంపనలు వచ్చాయి. కుంగిన ఏడో బ్లాకులోని 16వ నెంబరు గేటును ఎత్తడానికి నీటిపారుదల శాఖ అధికారులు ప్రయత్నించారు.అయితే బ్యారేజీ కింద నుంచి భారీగా ధ్వనులు రావడంతో వెంటనే ఆ పనులను నిలిపివేశారు. అక్కడి సెన్సార్లు సైతం శబ్దాలను గుర్తించి అలర్ట్ చేశాయి. దీంతో బ్యారేజీ పెను ప్రమాదానికి లోనయ్యే అవకాశముందని ఆ శాఖ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

## ప్రజాస్వామం, రాజ్యాంగాన్ని కాపాడేందుకే ఎన్నికలు

మొదటి పేజీ తరువాయి...

కేజ్రీవాల్ అరెస్ట్, బెయిల్‌పై ఆయన రావడం ఒక ఎత్తయితే, ముఖ్యమంత్రి భద్రతా సిబ్బంది ఒకరు ఎంపీ స్వాతిమాలీవాల్‌పై దాడి చేయడం వంటి ఘటనలు కలకలం రేపాయి. ఈ నేపథ్యంలో ఓటర్లు ఎటువైపు మొగ్గుచూపుతారో చూడాలి. ఇదిలావుండగా ఢిల్లీ ఓటర్లను ఉద్దేశించి కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ మాట్లాడిన వీడియోను ఆ పార్టీ విడుదల చేసింది. ప్రజాస్వామం, రాజ్యాంగాన్ని కాపాడేందుకు ఎన్నికలు చాలా ముఖ్యమైనవని గుర్తు చేశారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి సమస్యలు తారాస్థాయికి చేరాయని వివరించారు. ఈ పోరాటంలో ప్రజలు తమ వంతు పాత్ర పోషించాలని కోరారు. ఢిల్లీలోని ఏడు నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.ఢిల్లీతోపాటు యూపీలోని-14, హర్యానా- 10, బీహార్-8, బెంగాల్-8, ఒడిషా-6, జార?ండ్- 4, జమ్మూకాశ్మీర్ ఒక్క స్థానానికి శనివారం ఉదయం పోలింగ్ మొదలుకానుంది. ఇప్పటివరకు ఐదు విడతల్లో 428 నియోజకవర్గాలకు ఓటింగ్ పూర్తి అయ్యింది. రేపటితో ఆ సంఖ్య 486కు చేరుకోనుంది.

## నేడు రాజేంద్రనగర్, శంషాబాద్, నార్సింగిలలో విద్యుత్తు లేని ప్రాంతాలు

రాజేంద్రనగర్, మే 24(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని ఉప్పర్ పల్లి విద్యుత్ ఫీడర్ పరిధిలో తీగలకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడానికి ఉదయం పదకొండు గంటల నుండి మధ్యాహ్నం 12:30 వరకు బన్సీలాల్ నగర్ బుద్వేల్ విలేజ్ శివ సాయి కాలనీ జన చైతన్య-3, పరమ రెడ్డి, సహారా హోమ్స్ విద్యుత్ ఫీడర్ల పరిధిలో శనివారం మధ్యాహ్నం రెండున్నర నుండి సాయంత్రం నాలుగున్నర వరకు ఉప్పరపల్లి ప్రధాన రోడ్డు, పి ఎన్ ఆర్ అపార్ట్మెంట్, నాయుడుగాలని, డి మార్ట్, హరినాథ్ రెడ్డి కాలనీ చింతల్ మెట్ జలాల్ బాబా నగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ హాతిరాం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

### కిస్మత్పూర్ లో...

కిస్మత్పూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12:30 వరకు హనుమాన్ టెంపుల్, డాన్ బోస్కో స్కూల్, మిచిల్ కాలనీ, సంధ్యా నగర్ , ఎక్సైజ్ అకాడమీ, సుభాన్ హోటల్, మధ్యాహ్నం ఒంటిగంట నుండి రెండున్నర గంటల వరకు ఆదర్శనగర్, వికాస్ నగర్ ,గాయత్రి నగర్, ప్రశాంతి నగర్, కాళీ మందిర్ ప్రధాన రహదారి, ఖాళీగా నగర్, స్కూల్ భారతీ నగర్, ద్వారకా నగర్, మల్లికార్జున నగర్, ఎన్ ఎఫ్ సి కాలనీ ప్రాంతాలు, మధ్యాహ్నం మూడున్నర గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు భవాని కాలనీ, సాయిరాం నగర్, కృష్ణానగర్ ,బండ్లగూడ పోచమ్మ ఆలయం, శ్రీ మణివిహార్ ,వైష్ణవి, ఎస్ ఎన్ ఆర్ ,గుంట విల్లాస్ ,శ్రీ ఎంక్లేవ్, శివాజీ యూత్ బిల్డింగ్, విజయనగర్, బృందావన్ కాలనీ, వికాస్ నగర్, ప్రాంతాలలో చెట్ల కొమ్మలను తొలగించడానికి విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

### శంషాబాద్ లో...

శంషాబాద్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు చెట్ల కొమ్మలను



తొలగించడానికి పట్టణంలోని సామా ఎంక్లేవ్, శ్రీనివాస కాలనీ, రాళ్ళ గూడ, సీఎస్ కె, సాయి విచార్, వెంకటేశ్వర కాలనీ సిద్దుల గుట్ట మొగల్ గార్డెన్, కోత్వాల్ గూడ, కవ్వ గూడ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ షేక్ భాషా తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

### నార్సింగిలో...

ఇబ్రహీం భాగ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మలకు తొలగించడానికి శనివారం మధ్యాహ్నం 12 గంటల నుండి రెండు గంటల వరకు నెక్నాపూర్, ఫెయిర్ ఫీల్డ్ కాలనీ ఇవి కాలనీ వన్ మోర్ నగర్ ఫ్లోటిల్ల రాందేవ్ గూడా 11 గంటల నుండి ఒంటిగంట వరకు వెసెల్ల మెడోస్, తారామతి భారదారి, అల్కాపూర్ రోడ్ నెంబర్ 29, 30, కాశ్వా కాలనీ మార్వా టౌన్షిప్, మధ్యాహ్నం మూడు గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు కోహినూర్ ఎంక్లేవ్ భాషా కాలనీ, అలిజాపూర్, ఎన్నారై ఎంక్లేవ్ , ఖిజ్రా ఎంక్లేవ్ కేజీఎన్ జిరాక్స్ వెంకటేశ్వర కాలనీ పనీర్ ఎస్టేట్ ఈవివీ కాలనీ కృష్ణారెడ్డి వెంచర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ సందీప్ రెడ్డి తెలిపారు విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

### హిమాయత్ సాగర్ సెక్షన్లో...

స్నేహిత హిల్స్ విద్యుత్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటలకు పి అండ్ టీ కాలనీ, ఏ బ్లాక్ ,బి బ్లాక్, సి బ్లాక్, డీ బ్లాక్ ,స్పెషల్ బ్లాక్, కీర్తి రిచ్మండ్ విల్లాస్, విద్యానగర్, వీకర్ సెక్షన్ కాలనీ, గంధం గూడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం మూడు గంటల 30 నిమిషాల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు హనుమాన్ నగర్ సిటీ ప్రధాన రహదారి వేస్ట్ అండ్ కాలనీ గంధం గూడ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ పి శ్రీనివాస్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

### ఇబ్రహీం బాగ్ సెక్షన్ లో...

డోలార్ హిల్స్ విద్యుత్ ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు గోల్డెన్ టెంపుల్ ప్రాంతం షిరిడి సాయి నగర్ ఫ్రెండ్స్ కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం రెండు గంటల నుండి మూడున్నర గంటల వరకు ఫ్రెండ్స్ కాలనీ పోకల్ వాడ తనాశ నగర్ కూడా కాలనీ, లాలమ్మ గార్డెన్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3:30 నుండి సాయంత్రం ఐదు గంటల వరకు లాలమ్మ గార్డెన్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ జ్ఞానేశ్వర్ తెలిపారు.

### షాపూర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో...

షాపూర్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని జూకల్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు, పిల్లోని గూడ విద్యుత్ ఫీడర్ పరిధిలో తీగలకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడానికి శుక్రవారం జూ కల్,ఎర్రకుంట తాండ, పిల్లోని గూడ, జహంగీర్ గూడ ప్రాంతాలలో సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ సురేష్ రెడ్డి తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

# రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడానికే విత్తన మేళా



విత్తన మేళా ను ప్రారంభిస్తున్న వ్యవసాయ శాఖ కమిషనర్ డాక్టర్ బి. గోపీ



రైతుకు విత్తనాలు అందచేస్తున్న వ్యవసాయ శాఖ కమిషనర్ డాక్టర్ బి. గోపీ, వర్సిటీ పరిశోధన సంచాలకులు డాక్టర్ పి. రఘురామి రెడ్డి

బుద్వేల్, మే24(ప్రభాత ఉదయం): ఈ వానాకాలం సాగుకి రైతాంగానికి అవసరమైన విత్తనాలు, ఎరువుల్ని పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ డాక్టర్ బి. గోపి తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ ముమ్మరంగా సాగుతోందని ఆయన వివరించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాజేంద్రనగర్ లోని విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో ఈరోజు నిర్వహించిన విత్తన మేళా - 2024 ని ఆయన ప్రారంభించి ముఖ్య అతిథిగా ప్రసంగించారు. రైతుల డిమాండ్ కి అనుగుణంగా అన్ని జిల్లాల్లో ఆయా రకాల విత్తనాలని అందుబాటులో ఉంచడానికి రెండు నెలల నుంచి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని గోపి వివరించారు. నకిలీ విత్తనాలను అరికట్టడానికి ప్రభుత్వం చాలా తీవ్రమైన చర్యలు తీసుకుంటుందన్నారు. విత్తనాలు కొనుగోలు సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి రైతుల్లో చైతన్యం తీసుకురావడానికి అనేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కొత్త టెక్నాలజీలు, సాగు విధానాలపై రైతుల్లో అవగాహన కల్పించేందుకు 'రైతు నేస్తం' అనే కార్యక్రమంతో రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులు, శాస్త్రవేత్తల మధ్య చర్చ కార్యక్రమాలని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నకిలీ విత్తనాలు వల్ల రైతులు నష్టపోయినప్పుడు తక్షణ నష్టపరిహారం అందించేందుకు వీలుగా విత్తన చట్టంలో సవరణలు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుందన్నారు. ఈ అంశాలపై అసెంబ్లీలో చర్చ జరిగేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని గోపి వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పరిశోధనా స్థానాలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, ఏరువాక కేంద్రాల్లో విత్తనాలను అందుబాటులో ఉంచామని రైతులు ఆందోళన చెందవద్దని %ూజీూాఖ% రిజిస్ట్రార్, పరిశోధన సంచాలకులు డాక్టర్ పి. రఘురామి రెడ్డి వివరించారు. సరైన విత్తనాలు, మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే రైతులకు మంచి దిగుబడులు, ఆదాయం వస్తుందని ఆయన అన్నారు. రాష్ట్రంలో సాగయ్యే ప్రధాన పంటలకి సంబంధించి నాణ్యమైన, మేలైన, తెగుళ్ళను తట్టుకోగలిగే అనేక రకాల విత్తనాల్ని విశ్వవిద్యాలయం అందుబాటులోకి తెచ్చిందని వాటిని వినియోగించుకోవాలని రఘురాం రెడ్డి రైతులకి సూచించారు. ఈ సందర్భంగా రైతులకి విత్తనాలను పంపిణీ చేశారు. వివిధ పంటలకు సంబంధించిన వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించిన అనేక కరపత్రాలని సమావేశంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ సుధారాణి, విత్తన పరిశోధన సాంకేతిక సంస్థ సంచాలకులు డాక్టర్ పి. జగన్మోహన్ రావు, విత్తన ధ్రువీకరణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కేశవులు, విశ్వవిద్యాలయ అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ బి. గోపీ

# బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా లతాప్రేమ్‌గౌడ్



నూతన మేయర్ గా ప్రమాణ స్వీకారం చేసిన శ్రీలత గౌడ్ తో కార్పొరేటర్లు



నూతన మేయర్ ఎన్నికల కోసం చేతులెత్తి చూపిస్తున్న కార్పొరేటర్లు



శ్రీలత గౌడ్ మేయర్ గా సర్టిఫికెట్ అందజేస్తున్న ఆర్డీవో వెంకటరెడ్డి

## ఏకగ్రీవంగా శ్రీలత గౌడ్ అనుకున్న కార్పొరేటర్లు

రాజేంద్రనగర్,మే24(ప్రభాత ఉదయం) బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ నూతన మేయర్‌గా మద్దెల లతాప్రేమ్‌గౌడ్ శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు.గతంలో మేయర్‌గా ఉన్న బుర్ర మహేందర్ గౌడ్‌కు వ్యతిరేకంగా డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డితో కలిసి 16 మంది కార్పొరేటర్లు అవిశ్వాస తీర్మాణాన్ని పెట్టారు.దీంతో మార్చి 21వ తేదీన జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బలనిరూపణ చేపట్టారు.అందులో మేయర్‌పై అవిశ్వాసం నెగ్గడంతో మేయర్ పదవి ఖాళీగా ఏర్పడింది.దీంతో శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ పదవీకి ఎన్నిక నిర్వహించారు.కార్పొరేషన్ పరిధిలోని 22 డివిజన్‌లకు చెందిన కార్పొరేటర్లు ఉండగా అందులో లతాప్రేమ్‌గౌడ్‌కు మద్దతుగా 17 మంది కార్పొరేటర్లు తమ అభిప్రాయాన్ని వెల్లడించారు. దీంతో లతాప్రేమ్‌గౌడ్ ఏకగ్రీవంగా మేయర్‌గా ఎన్నికైనారు. రాజేంద్రనగర్ ఆర్డిఓ వెంకట్‌రెడ్డి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. మేయర్‌గా లతాప్రేమ్‌గౌడ్‌తో ఆయన ప్రమాణస్వీకారం చేశారు.ఈ సందర్భంగా చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి కార్పొరేషన్ కార్యాలయానికి చేరుకోని మేయర్ లతాప్రేమ్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపిన శాలువాలతో ఘనంగా సన్మానించారు.మేయర్‌గా లతాప్రేమ్ గౌడ్ ఎన్నిక కావడంతో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.స్థానిక నాయకులు భారీ పూలమాలతో ఆమెను సత్కరించారు.



నూతన మేయర్ శ్రీలత గౌడ్ తో ప్రమాణస్వీకారం చేస్తున్న ఆర్డిఓ వెంకట్ రెడ్డి



నూతన మేయర్ శ్రీలత కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కమిషనర్

## ధర్మం,న్యాయం గెలిచింది... మేయర్ మద్దెల లతాప్రేమ్‌గౌడ్.

బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ లో ధర్మ గెలిచిందని మేయర్ లతాప్రేమ్‌గౌడ్ అన్నారు.బీఆర్ఎస్ మాజీ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ ఒంటెద్దు పోకడలతో పాటు పలు డివిజన్‌లలో సమస్యలను పరిష్కరించడంలో విఫలమైయ్యారని మేయర్ లతాప్రేమ్‌గౌడ్ అన్నారు.నిధులు కూడా మంజూరు చేయకుండా పనులు జరగకుండా అడ్డుపడ్డారన్నారు.తన సొంత ప్రయోజనాలకు తప్ప ప్రజల శ్రేయస్సు కోసం ఏమాత్రం పని చేయలేదని ఆరోపించారు.మాజీ మేయర్ మహేందర్‌గౌడ్‌పై కార్పొరేటర్లు అందరూ కలిసి అవిశ్వాసం పెట్టి కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. కార్పొరేటర్లు అందరూ న్యాయంవైపే ఉన్నారని అందుకోసమే బుర్ర మహేందర్‌గౌడ్‌ను గద్దె దించడం జరిగిందన్నారు.తాను నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారం దిశగా కృషి చేస్తానని స్పష్టం చేశారు.

# విత్తన మేళాకు అనూహ్యస్పందన



తమకు కావలసిన విత్తనాలను ఎంపిక చేసుకుంటున్న రైతులు



విత్తన రకాలను పరిశీలిస్తున్న రైతులు



విత్తన మేళా లో రైతులు

## గత సంవత్సరం విత్తనాలు అమ్మగా రూ.26.07 లక్షలు . ఈ సంవత్సరం రూ.73.5 లక్షలు తెలంగాణ సోనా గత సంవత్సరం 121 క్వింటాలు విక్రయించగా, ఈ సంవత్సరం 482 క్వింటాళ్ళు విక్రయం

బుద్వేల్, మే24(ప్రభాత ఉదయం): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శుక్రవారం జరిగిన విత్తనమేళాకు అనూహ్యస్పందన లభించింది. రాజేంద్రనగర్ లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన విత్తనమేళాకు అనూహ్యంగా 2800 మంది రైతులకు పైగా హాజరయ్యారు. గత ఏడాదికన్నా రెట్టింపు సంఖ్యలో రైతులు విత్తనమేళా కు హాజరై వివిధ పంటల విత్తనాలను కొనుగోలు చేశారు. ఈ ఖరీఫ్ సీజన్ లో రుతుపవనాలు సకాలంలో రాష్ట్రంలోకి ప్రవేశిస్తాయన్న వాతావరణ శాఖ అంచనాలతో నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయడానికి ఈసారి రైతులు ఆసక్తికనబరిచారు. శుక్రవారం వర్ష సూచన ఉండడంతో రైతులకు ఇబ్బంది కలుగవద్దనే ఉద్దేశంతో విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో విత్తనమేళాను నిర్వహించినట్లు రిజిస్ట్రార్ మరియు పరిశోధనా సంచాలకులు డాక్టర్ రఘురామి రెడ్డి తెలిపారు. విత్తనమేళకు హాజరైన రైతులందరికీ భోజన సదుపాయం కల్పించామని, అలాగే రైతులకు సరిపడా విత్తనాలను అందుబాటులో ఉంచామన్నారు. విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రాలతో పాటు, రాజేంద్రనగర్ లోను విత్తనాల విక్రయాలు రేపటి నుంచి కూడా కొనసాగుతాయని అన్నారు. 2018 నుంచి విశ్వవిద్యాలయంలో రాజేంద్రనగర్ లో విత్తనమేళ నిర్వహిస్తున్నారు. ప్రతిఏటా సరాసరి 1000 నుంచి 1300 మంది రైతులు హాజరయ్యారు. అయితే ఈసారి విత్తనమేళకు అనూహ్య స్పందన లభించింది. 2800 మంది పైగా రైతులు శుక్రవారం రాజేంద్రనగర్ లో హాజరయ్యారు. 16 పంటలలో విశ్వవిద్యాలయంలో అందుబాటులో ఉన్న 67 రకాల విత్తనాలను విక్రయిస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరంలేదని అన్నారు.



విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

# ప్రశాంతంగా పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలు

గద్వాల జిల్లా ప్రతినిధి, మే 24(ప్రభాత ఉదయం)పాలిటెక్నిక్‌లోని మూడు సంవత్సరాల కోర్సులకు ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ డిప్లమా కోర్సులతో పాటు, వ్యవసాయ డిప్లమా, వెటర్నరీ డిప్లమా కోర్సులకు నిర్వహించిన ప్రవేశ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ముగిసాయి. జిల్లా కేంద్రంలో గోనుపాడులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఎంఎఎల్ డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ప్రవేశ పరీక్షకు సెంటర్లను ఏర్పాటు చేయగా, మొత్తం నాలుగు సెంటర్ లలో 1,589 విద్యార్థులకు గాను 1,435మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్, జిల్లా కోర్టినేటర్ టి.రాంమోహన్ తెలిపారు. పరీక్ష రాసే విద్యార్థులను గంట ముందు పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు.

# ముందుగా వెళ్తున్న ఇటుక లారీని డీ కొన్న డీసీఎం, డ్రైవర్ మృతి

బుద్వేల్, మే24(ప్రభాత ఉదయం) : శంషాబాద్ నుంచి గచ్చిబౌలి కి డీసీఎం లో వెళ్తున్న డ్రైవర్ ముందుగా వెళుతున్న ఇటుక లారీని హిమాయత్ సాగర్ వద్ద ఢీ కొట్టాడు. దీంతో డీసిఎం నడుపుతున్న డ్రైవర్ శిశుపాల్ రెడ్డి (49) కి తీవ్ర గాయాలయ్యాయి . స్థానికులు 108కు ఫోన్ చేయగా అంబులెన్స్ వచ్చి శిశు పాల్ రెడ్డిని నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ శిశుపాల్ రెడ్డి మరణించాడు . కేసు ను రాజేంద్రనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



రోడ్డు ప్రమాదంలో మరణించిన శిశుపాల్ రెడ్డి



విత్తన మేళా ను సందర్శించిన ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి. చిన్నా రెడ్డి

# రైతుగా విత్తన మేళాను సందర్శించిన డాక్టర్ జి చిన్నా రెడ్డి

బుద్వేల్, మే24(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ లో శుక్రవారం జరిగిన విత్తన మేళా ను ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి చిన్నారెడ్డి ఓ సాధారణ రైతు మాదిరిగా సందర్శించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఆయన సభా వేదిక పైకి రాలేదు. విత్తన మేళా లో ఏ ఏ రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయి... అని అడిగి తెలుసుకున్నారు. స్వతహాగా రైతు అయినా డాక్టర్ జి చిన్నారెడ్డి తమకు ఎలాంటి విత్తనాలు ఉపయోగపడతాయో చూసి వాటి గురించి శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకోవడం కనిపించింది.



నకిలీ విత్తనాలతో పోలీసులు

# నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

ఊట్కూర్ ,మే24(ప్రభాత ఉదయం)మండల పరిధిలోని నిడుగుర్తి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇంట్లో అక్రమంగా 13.7 కిలోల నకిలీ పత్తి విత్తనాలు నిల్వ ఉంచి అమ్ముతున్నారు అన్న పక్క సమాచారంతో టాస్క్ ఫోర్స్, ఊట్కూర్ పోలీసులు పట్టుకున్నారు. పత్తి విత్తనాలు పట్టుకొని పోలీస్ స్టేషన్ కు తరలించి ఏవో గణేష్ రెడ్డి పంచనామా అనంతరం అక్రమంగా నిల్వ ఉంచిన నిడుగుర్తి గ్రామానికి చెందిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాసులు పేర్కొన్నారు. ఎవరైనా నాకిని విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ హెచ్చరించారు.

# జూనియర్ ఇంటర్మీడియేట్‌లో దరఖాస్తులు ఆహ్వానం

గద్వాల జిల్లా ప్రతినిధి, మే 24(ప్రభాత ఉదయం)ఎస్సీ గురుకుల సొసైటి పరిధిలోని నాన్ - సివోఈ విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి జూనియర్ ఇంటర్మీడియేట్ లో మిగిలిపోయిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురుకుల సొసైటి జిల్లా సమన్వయకర్త ఎస్.రఘు తెలపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 24 నుండి 31 వరకు గురుకుల సొసైటీ Website: tswrels.ac.in వెబ్ సైట్ ద్వారా ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీసీ, బైపీసీ ఎంఇసీ, సీఇసీ, హెచ్ఇసీ, వొకేషనల్ కోర్సులలో సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. దరఖాస్తు రుసుము క్రింద రూ.100 ఆన్ లైన్ లో చెల్లించాలని కోరారు.

# సిపిఎస్ ఉద్యోగ ఉపాధ్యాయుల మద్దతు తీన్మార్ మల్లన్నకే








స్నితప్రజ్ఞా ఆధ్వర్యంలో తీన్మార్ మల్లన్నకు మద్దతు తెలుపుతున్న నాయకులు

### సీపీఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గంగాపురం స్థితప్రజ్ఞ

హైదరాబాద్: మే 25( ప్రభాత ఉదయం) ఉమ్మడి నల్గొండ-ఖమ్మం -వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ గారికి తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ తన సంపూర్ణ మద్దతును రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో తీర్మానం చేసి ప్రకటించింది. ఈసారి ఉప ఎన్నికల్లో చింతపండు నవీన్ గారిని బలపరుస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వాల్ శ్రీకాంత్ రాష్ట్ర కోశాధికారి నరేష్ గౌడ్ లు సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. తదనగుణంగా సీపీఎస్ ఉద్యోగ,ఉపాధ్యాయ కుటుంబాల పట్టభద్రులు తప్పకుండా సీపీఎస్ రద్దు -పాత పెన్షన్ పునరుద్ధరణ కృషి చేసే మల్లన్న ను మొదటి ప్రాధాన్యత ఓటు తో గెలిపించాలని గత పది సంవత్సరాల నుండి పసి పిల్లల నుండి పండు ముసలి వరకు అందరికి న్యాయం జరగాలని అలుపెరుగని పోరాటం చేసి ప్రజా గొంతుక గా మారి ప్రజా పాలన కొరకు అహర్నిశలు కృషి చేసి ఎటువంటి అధికార పదవులు లేని సమయంలో నే అనేక సమస్యలకు పరిష్కార మార్గం చూపిన మల్లన్న కు అధికారం తోడై చట్టసభలో అడుగుపెడితే ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల సాధన కు ప్రభుత్వం కు అనుసందనకర్త గా కాంగ్రెస్ పార్టీ తన మ్యానిఫెస్టోలో పెట్టిన మొట్టమొదటి ప్రాధాన్యత అంశం పాత పెన్షన్ పునరుద్ధరణ జరిగే విధంగా ఒక సేవకునిగా కృషి చేస్తానని మాట ఇచ్చిన మల్లన్న కు అత్యధిక మెజారిటీ తో గెలిపించాలని కోరారు ఈ సమావేశంలో %=ఉదీ% డిపార్ట్మెంట్ లో చనిపోయిన సిపిఎస్ ఉద్యోగి కుటుంబానికి ఫ్యామిలీ పెన్షన్ పత్రాలను కుటుంబసభ్యుల కు రాష్ట్ర అధ్యక్షులు స్థిత ప్రజ్ఞ గారి చేతుల మీదుగా అందించారు. సీపీఎస్ ఉద్యోగుల ఫ్యామిలీ పెన్షన్ లో ఎదుర్కొనే సమస్యలను ప్రభుత్వానికి , కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసే విధంగా ఫ్యామిలీ పెన్షన్ ను సీపీఎస్ ఉద్యోగుల ఉండేలా ప్రభుత్వానికి నివేదించాలని తీర్మానించారు. సీపీఎస్ ఉద్యోగ ఉపాధ్యాయుల కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం సమస్య నే కాకుండా భవిష్యత్ లో సీపీఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులు ఎదుర్కొనే ప్రతి సర్వీస్ సంబంధిత సమస్యలను సీపీఎస్ సంఘమే పరిష్కరించాలని తీర్మానించారు. ఈ సమావేశంలో 33 జిల్లాల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శి లు, కోశాధి కారులు, రాష్ట్ర బాధ్యులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్ రెడ్డికి ఆహ్వాన పత్రం అందజేస్తున్న డాక్టర్ సత్యం

## జూన్ 6 నుండీ 8 వరకు జరిగే 47వ సీనియర్ నేషనల్ త్రోబాల్ ఛాంపియన్‌షిప్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌కు ఆహ్వానం

### అసోసియేషన్ ఆర్గనైజింగ్ చైర్మన్ సత్యం శ్రీరంగం

కూకట్‌పల్లి, మే 24 (ప్రభాత ఉదయం) నేషనల్ త్రోబాల్ సీనియర్ 47వ ఛాంపియన్ షిప్ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి పోవంత్ రెడ్డిని శుక్రవారం రేవంత్ రెడ్డి నివాసంలో తెలంగాణ త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్షులు, ఆర్గనైజింగ్ చైర్మన్, టీపీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ సత్యం శ్రీరంగం ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ మేరకు అధికార ప్రతినిధి డాక్టర్ సత్యం శ్రీరంగం హైదరాబాద్ హయత్‌నగర్‌లోని వర్ద్ అండ్ డీడ్ ఎడ్యుకేషనల్ అకాడమీలో జూన్ 6 నుంచి 8 వరకు జరిగే 47 వ సీనియర్ నేషనల్ త్రోబాల్ ఛాంపియన్ షిప్ కి ఆహ్వాన పత్రం అందచేసి, భారతదేశంలోని 25 రాష్ట్రాల నుండి క్రీడాకారులు పాల్గొనే ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్ ను రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించాలని ఆయన విజ్ఞప్తి చేసారు.

## దొంగలు రిమాండ్

గద్వాల జిల్లా ప్రతినిధి, మే 24(ప్రభాత ఉదయం)గద్వాల పట్టణంలో వేర్వేరు ఘటనలలో దొంగతనం చేసిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు రిమాండ్ కు తరలించారు. పట్టణ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం... ఏప్రిల్ 24 న ఆంధ్రప్రదేశ్ లోని చీరాల గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు కారులో వచ్చి గద్వాల పట్టణంలోని విఘ్నేశ్వర హ్యాండ్లూమ్ చీరల షాప్ లో ఏడు చీరలు దొంగిలించారు. నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా చీరలు ఎత్తుకెళ్లిన వ్యక్తులలో ఒక్కరు దేవర శివ అనే వ్యక్తిని గుర్తించి శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. అదే విధంగా గద్వాల పట్టణంలోని ఓ లేడీస్ కార్నర్ షాపులో కౌంటర్లో ఉంచిన రూ.20,000 లను అపహరించిన కేసులో గద్వాలకు చెందిన మేకల వెంకటేష్ అనే వ్యక్తిని రిమాండ్ కు తరలించారు.

## అమ్మ ఆదర్శ పాఠశాలల్లో కనీస మౌలిక వసతులకు సంబంధించిన పనులను త్వరితగతిన పూర్తిచేయాలి




గద్వాల జిల్లా ప్రతినిధి, మే 24(ప్రభాత ఉదయం)అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టవలసిన కనీస మౌలిక వసతులకు సంబంధించిన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ బి. యం. సంతోష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలోని సమావేశ మందిరంలో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులపై సంబంధిత అధికారులతో మండలాల వారిగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు చేపట్టవలసిన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అన్నారు. వారం రోజులలో అన్ని పాఠశాలల్లో కనీసం 50 శాంతం పనులు పూర్తి కావాలన్నారు. చేపట్టే పనులకు నిధుల కొరత లేదని, చేపడుతున్న పనులన్నీ నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలన్నారు. పాఠశాలలు పున ప్రారంభం అయ్యేలోగా పనులన్నీ పూర్తి కావాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీఓలు క్షేత్ర స్థాయిలో ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షించాలని సూచించారు. పనులలో నిర్లక్ష్యం వహిస్తే తీవ్ర చర్యలు తప్పవని హెచ్చరించారు.



### ఉరుములు మెరుపులతో
## దద్దరిలుతున్న గద్వాల

### గద్వాల, మల్దకల్, అయిజ, వడ్డేపల్లి మండలాలో దంచికొట్టిన వర్షం
### నేలకొరిగిన చెట్లు.. నిలిచిన విద్యుత్ సరఫరా

గద్వాల జిల్లా ప్రతినిధి, మే 24(ప్రభాత ఉదయం)జోగులాంబ గద్వాల జిల్లాలో గద్వాల,మల్దకల్, అయిజ, వడ్డేపల్లి మండలాలో శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులకు పలు గ్రామాల్లో చెట్లు నెలకొరిగాయి. రేకుల డబ్బాలు లేచిపోయాయి. ఉరుములు, మెరుపులతో వర్షం పడడంతో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.

**ఒక్కసారి చల్లబడ్డ వాతావరణం**

భానుడు కాస్త శాంతించాడు. మెరుపులు, ఉరుములతో కూడిన అకాలవర్షం కురవడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. రెండు రోజుల క్రితం వరకు జిల్లాలో పలు ప్రాంతాల్లో 38 నుండి 40 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదైన విషయం తెలిసిందే. శుక్రవారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడినవర్షం కురిసింది. గట్టు, ధరూర్, కేటిదొడ్డి మండలాలు ఈదురుగాలులు వీశాయి. దీంతో ఒక్క సారి వాతావరణంలో చల్లబడటంతో ఉక్కపోత కాస్త తగ్గడంతో ప్రజలు ఉపశమనం పొందారు.

## తెలంగాణ రాష్ట్రంలో రాజకీయాల కతీతంగా వీసి పోస్టులను భర్తీ చేయాలి

### జూన్ 2, స్వరాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం లోపు రెగ్యులర్ విసీలను నియమించాలి....

### తెలంగాణ యూనివర్సిటీల ఐక్య కార్యాచరణ కమిటీ రాష్ట్ర చైర్మన్, జె ఎన్ టి యు హెచ్ యూనివర్సిటీ విద్యార్థి నేత ఎరవెల్లి జగన్



కూకట్‌పల్లి, మే 24 (ప్రభాత ఉదయం) తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీలో విసీల పోస్టులను రాజకీయాలకతీతంగా భర్తీ చేయాలని, జూన్ 2 స్వరాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం లోపు రెగ్యులర్ విసీలను నియమించాలని ఆల్ తెలంగాణ యూనివర్సిటీస్ ఐక్య కార్యచరణ కమిటీ రాష్ట్ర చైర్మన్, జేఎన్టీయూహెచ్ యూనివర్సిటీ విద్యార్థి నేత ఎరవెల్లి జగన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎరవెల్లి జగన్ మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన తప్పుడు నిర్ణయాల వల్ల గత ప్రభుత్వానికి అణువుగా ఉన్న వ్యక్తులకే విసి పోస్టులను కట్టబెట్టి యూనివర్సిటీలను బ్రష్టు పట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే గత ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా నియమించిన యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్ పై కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే విచారణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ రాష్ట్రంలోనే అత్యున్నతమైన సాంకేతిక విశ్వవిద్యాలమైన జేఎన్టీయూహెచ్ యూనివర్సిటీకి టెక్నికల్ బ్యాక్ గ్రౌండ్, మరియు జె ఎన్ టి యు హెచ్ యూనివర్సిటీలో ప్రొపెసర్స్ గా పని చేసిన ప్రొపెసర్స్ నే నియమించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ యూనివర్సిటీలలో ఇన్చార్జి పాలనను గతంలో వ్యతిరేకించిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఇన్చార్జి వీసీల నియమించడం విద్యార్థులోకానికి విస్మయానికి గురి చేసిందన్నారు. తక్షణమే రెగ్యులర్ వైస్ ఛాన్సలర్ నియామకంపై దృష్టి కేంద్రీకరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాజాగా నియమించిన విసీలు ఐఏఎస్ అధికారులు ప్రభుత్వంలోని ఆయా శాఖలలో బాధ్యత నిర్వహించేవారు కావడం వలన విశ్వవిద్యాలయాల పరిపాలన బాధ్యతలు నిర్వహించడం విద్యార్థుల సంక్షేమానికి ఆటంకం అవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి రాష్ట్ర విశ్వవిద్యాలయాల అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి ఉంటే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం జూన్ రెండులోపు ప్రొఫెసర్లను వైస్ ఛాన్సలర్ గా నియమించాలని కోరారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కేంద్రంగా యూనివర్సిటీలో నిరంతరం అందుబాటులో ఉండే వైస్ ఛాన్సలర్ ఉంటే వర్సిటీ ఉపయోగమని అన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ప్రొఫెసర్లను రెగ్యులర్ వైస్ ఛాన్సలర్ గా నియమించాలని, అదేవిధంగా విద్యాభివృద్ధి కోసం యూనివర్సిటీల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. తక్షణమే పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ రియంబర్స్మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు మార్వాడి అభిషేక్, రుద్రపాటి జాహ్నవి, వొజ్జల జ్యోత్స్న, భూక్య కల్పన చంద్రశేఖర్ ఆజాద్, కోడం సంతోష్, లింగాల సాగర్, నునావత్ ప్రశాంత్, ఉదయ్ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.



### పేదల పక్షాన పోరాటం చేసిన యోధుడు...
## పేదల నేత మహేష్ కుమార్ గౌడ్

### పేదలను ఆదుకునేది కాంగ్రెస్ ప్రభుత్వమే
### అన్ని వర్గాలకు న్యాయం చేసేది కాంగ్రెస్ పార్టీయే
### కూకట్ పల్లి కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి

కూకట్‌పల్లి, మే 24 (ప్రభాత ఉదయం) కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన సందర్భంగా కూకట్ పల్లి నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున తరలివెళ్లి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శేరి సతీష్ రెడ్డి బొకే అందజేసి మహేష్ కుమార్ గౌడ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పేదల సంక్షేమానికి కట్టుబడి పని చేస్తుందని పేదల పెన్నిధి అయిన మహేష్ కుమార్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ లో కీలక పదవి లో ఉండి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలో కి తీసుకువచ్చిన ముఖ్యుల్లో మహేష్ కుమార్ గౌడ్ ఒకరు అని చెప్పక తప్పదు అన్నారు. పేదల పక్షాన నిలిచి ఉండే పార్టీ కాంగ్రెస్ అయితే దేశంలో దారిద్ర్య నిర్మూలనకు కృషి చేసిన రాజకీయ పార్టీ కాంగ్రెస్ అని కొనియాడారు. నిరంతరం ప్రజల కోసం పరితపించే మహేష్ కుమార్ గౌడ్ నిండు నూరేళ్లు కలకాలం వర్ధిల్లాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో అబ్దుల్ బాకీ, ప్రభాకర్ రెడ్డి నగర్ అధ్యక్షులు సంజీవరావు, కాంగ్రెస్ నాయకులు బి బ్లాక్ అధ్యక్షురాలురేష్మ, కెపిహెచ్బి డివిజన్ ప్రెసిడెంట్ పొన్నం రజిత, అరవింద, నితీష్ కుమార్ గౌడ్, అక్బర్ భాయ్, అల్లావుద్దీన్, టిల్లు, మధు మొయిస్, డా. విజయ భవాని, మధు, కలాం, దుర్గా ప్రసాద్, మహేష్, నిశ్చల్, శ్రీకాంత్, సుదర్శన్, నమ్రత, ప్రసన్న, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు మజ్జిగ పంపిణీ చేసిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగులు



రైతులకు మజ్జిగ అందచేస్తున్న రాజేంద్రనగర్ బ్రాంచ్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్‌తో వర్సిటీ ఉన్నతాధికారులు



మజ్జిగ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ పి రఘురామిరెడ్డి

బుద్వేల్, మే24(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో శుక్రవారం జరిగిన విత్తన మేళా కు హాజరైన రైతులకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రాజేంద్రనగర్ బ్రాంచ్ ఉద్యోగులు మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ లో భాగంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ సోనాలిక ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు . మజ్జిగ కేంద్రాన్ని వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ , పరిశోధన సంచాలకులు డాక్టర్ పి. రఘురామిరెడ్డి ప్రారంభించారు. 4000 మజ్జిగ ప్యాకెట్లను ఈ సందర్భంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగులు రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వర్సిటీ శాస్త్రవేత్తలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.